# 'మీరేం చేస్తుంటారు?'

మనం కొత్తవారికి పరిచయం కాబడ్డప్పుడు తరచు ఎదుర్కొనే ప్రశ్న – మగవారైతే 'మీరేం చేస్తూంటారు?", ఆడవారైతే 'మీవారేం చేస్తూంటారు', 'పిల్లలైతే 'మీ నాన్నేం చేస్తూంటాడు' అని. దానికి మనమిచ్చే సమాధానం భవిష్యత్తులో వాళ్లతో సంబంధాన్ని నిర్దేశిస్తుంది. కాదులే అని పైకనుకున్నా, అది పచ్చి వాస్తవం.

'నేను ఫలానా జిల్లా అధికారిని' అన్నప్పుడు వచ్చే రియాక్షన్ వేరు, 'నేనో ఆటో డ్రైవర్ని' అన్నప్పుడు వచ్చే రియాక్షన్ వేరు.

అదే ఆడవాళ్లయితే 'మావారు తహసిల్దారు' అన్నంత గర్వంగా 'మావారు ఫలానా హోటల్లో వంటవాడు' అన్చెప్పుకోలేరు. నిజానికి అయిదుచుక్కల హోటల్లో వంటవాడి జీతం, తహసిల్దారు జీతం గీతం అన్నీ కలుపుకున్నదానికంటే ఓ మూడ్రెట్లు ఎక్కువే ఉంటుంది.

మన మిథ్యా విలువలు ఒక్కొక్క వృత్తికి ఒక్కొక్క గౌరవాన్ని (కొండొకచో అగౌర వాన్ని) ఆపాదించి పెట్టాయి మరి. మనం నిస్సహాయులుగా వాటిని పాటిస్తూనే ఉన్నాం.

ఇక్కడో చిన్నమాట. జీటీవీ ఛానెల్లో 'ఖానా ఖజానా' అనే వంటల కార్యక్రమం నిర్వహించే సంజీవ్‌కపూర్ స్వయంగా చెప్పిన మాట. అతనిది ప్రేమ వివాహం. అతని భార్య అల్యోనా వెళ్లి ఆమె నాన్నగారితో 'నాన్నా నేను సంజీవ్‌ను ప్రేమిస్తున్నాను. పెళ్లి చేసుకోబోతున్నా'నని ప్రకటిస్తే, ఆవిడ నాన్నగారు కోప్పళ్ళేదుట. 'హా' అని ఆశ్చర్యపోయి 'క్యా ఏక్ బావర్చీ సే షాదీ కర్నా చాహతీహో!' అని హోరుమన్నాట. అంటే 'హేమిటీ ఒక వంటవాణ్ణి ప్రేమించి పెళ్లాడ్తావా!' అని. మరి పాపం వంటవాడికి పెళ్లీపెటాకులు అక్కర్లేనట్టు. వాడికి ప్రేమించబడే అర్హత లేనట్టు ఉందీ కానీండిగానీ వాడు పెళ్లాడ్తే ఇంకో వంటలక్కనే పెళ్లాడాలి. అదీ గంటెలూ గంగాళాలూ పట్టుకు వంటకెళ్లాలి. ఇదీ మనవాళ్ల ఆలోచన.

ఇంతకీ మన టాపిక్ 'మీరేం చేస్తుంటారు.' అన్న ప్రశ్న గదండీ. అందరి సంగతలా వుంచి నా వ్యక్తిగత జీవితంలో ఆ ప్రశ్న చాలాసార్లు ఎదుర్కొన్నాను. రకరకాల రియాక్షన్లు చూశాను నా సమాధానానికి. 'మీరేం చేస్తుంటారు?' అన్న ప్రశ్న వెనుక 'నీ ఆర్థికస్తోమత ఎంత? ఏమిటి?' అన్న దిగంబరమైన ఇంక్వైరీ వుంటుందన్నది వాస్తవం.

నేను గతంలో భుక్తికి రకరకాల పనులు చేశాను. ఒకానొకప్పుడు స్నేహితుడి స్టోర్స్‌లో సేల్స్‌మన్‌గా పన్జేస్తున్నప్పుడు, మా అక్కయ్యలే ఇబ్బందిపడేవారు, నేను ఓ పెద్ద

కొట్లో సరకులందించే ఉద్యోగం చేస్తున్నానని చెప్పుకోడానికి. మా సావిత్రక్క మరీ. ఎందుకంటే ఆవిడ డిప్టీ తాసిల్దారుగారు కాబట్టి.

ఇప్పుడు నేను భుక్తికంటూ ఏమీ చేయడం లేదు. ఎవరైనా పై ప్రశ్న వేసినప్పుడు 'ఏమీ చైనండీ' అన్నప్పుడు వాళ్ల ముఖాల్లో రియాక్షను చూడాలండి. 'మరి భోజనం?' అన్నట్టు చూస్తారు. నేను వాళ్లింటికి భోజనాని కొచ్చేస్తానేమోనన్నట్టు. ఇంక నా పోషణ భారం వాళ్లమీద పడిపోయినట్టు ఫీలయిపోతారు. 'అబ్బే భోజనానికి ఇబ్బంది లేదండీ' అన్నాననుకోండీ, 'ఎలా?' అన్నట్టు మొహం పెడతారు. నేను జవాబుదారీ అయినట్టు.

ఈ మధ్యన ఒకాయన నా పుస్తకాలు చదివి, మీ అభిమానినయ్యానండీ అంటూ వచ్చారు. మీ పుస్తకాల్లో ఫలానాది ఫలానాగా అద్భుతంగా చెప్పారండీ అన్నారు. ఆయన 'మీరేం చేస్తుంటారు' అని ప్రశ్నించకపోయేసరికి, ఓహో చాత్రోజులకొక వ్యక్తి నాలాంటి వాడే కన్పించాడనుకున్నాను. ఆయన హైదరాబాద్ వెళ్లి మా శాస్త్రుల్ననడిగాడట 'ఇంతకీ ఆయనేం చేస్తుంటాడండీ' అని.

* * *

చాలామంది చిన్నపిల్లల్ని ఇబ్బంది పెట్టే ప్రశ్న మీ నాన్నేం చేస్తుంటాడు? అన్నది. మా నాన్న డాక్టరు, మా నాన్న యాక్టరు అని కొంతమంది పిల్లలు గర్వంగా చెప్పొచ్చు. ఇప్పుడు కాన్వెంట్ సంస్కృతి వచ్చి పడింది గదండీ. తమతమ ఆదాయాలతో ప్రమేయం లేకుండా తల్లిదండ్రులు పిల్లల్ని భారీ ఫీజుల్తో కాన్వెంట్లనబడే వెర్రి బళ్లలో చేర్చేస్తున్నారు. సరే డాక్టర్లతో, యాక్టర్లతో, కలెక్టర్లతో మాత్రమే మన సమాజం నిండిలేదుగదండీ. ఆటోవాలాలు, అటెండర్లు, గుమస్తాలు, సర్వర్లు, స్వీపర్లులాంటి వాళ్లు కూడా వుంటారు గదండీ (అసలు వీళ్ల శాతమే ఎక్కువ.) వాళ్లు కూడా ఈ కాన్వెంట్ మాయకు చిక్కిన వాళ్లే గదండీ. వాళ్ల పిల్లలకండీ ఇబ్బంది 'మీ నాన్నేం చేస్తుంటాడు' అన్న ప్రశ్నతో. వాళ్లిచ్చే సమాధానం వాళ్ల స్నేహితుల్ని నిర్దేశిస్తుంది. క్లాసులో వాళ్ల స్థానాన్ని నిర్దేశిస్తుంది. టీచర్లు వాళ్ల పట్ల ప్రవర్తించే తీరును నిర్దేశిస్తుంది. (వాళ్లు కూడా డాక్టరు, యాక్టర్ల పిల్లలంతే ఫీజులు కడ్తారు.)

నాకు బాగా తెల్సిన ఓ అమ్మాయి తన కూతుర్ని కాన్వెంట్ మాన్పించింది. దానికి ఆ మహాతల్లి ఇచ్చిన కారణం, వాళ్లింట్లో పనావిడ కొడుకు కూడా అదే కాన్వెంట్లో చదువుతున్నాట్ట. ఎంతసయ్యమంకుల్' అందా అమ్మాయి.

ఇది ఆర్థిక సూత్రానికి సంబంధించింది కాదు, మనిషి లోపలి చీకటి వ్యక్తిత్వానికి సంబంధించినది, ఆలోచించండి.

* * *

***కడుపు నింపుకోడానికి డబ్బు కావాలి కాబట్టి, మనిషి తనకు చేతనైన వృత్తి ద్వారా డబ్బు సంపాదించుకుంటాడు. కానీ డబ్బు మనిషిని సంపాదించగలదా?*** ●